క్లుప్తంగా

కెమిస్ట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కంబాలచెరువు: ది రాజమండ్రి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. అధ్యక్షుడిగా పిల్లా బాల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా సీహెచ్ ఫణీంద్ర, కోశాధికారిగా వై.లీలాధర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా ఎస్.సత్యనారాయణ, టీవీజే మోహనరావు వ్యవహరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం – విజయవాడ రైలులో గత నెలలో అపస్మారక స్థితిలో కనిపించిన వ్యక్తి.. రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జీఆర్పీ ఎస్సై పి.లోవరాజు తెలిపిన వివరాల ప్రకారం .. గత నెల 29వ తేదీన మెమూ షెడ్డుకు సర్వీసింగ్ వెళ్లిన రైలులో సుమారు 50 ఏళ్ల వ్యక్తి స్పృహ తప్పి ఉండగా గుర్తించారు. వెంటనే 108కి కాల్ చేసి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీ రూమ్‌కు తరలించారు. అతడి ఆచూకీ తెలిసినవారు 94406 27551, 94914 44022, 0833 2442821 నంబర్లకు సమాచారం ఇవ్వవచ్చు.

మాదాల నారాయణ స్వామికి నివాళి

ప్రకాశం నగర్: మాజీ ఎంపీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు మాదాల నారాయణస్వామి వర్ధంతి సభను సోమవారం స్థానిక మావోభవన్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా నారాయణ స్వామి పట్టుదల, అంకిత భావంతో రైతుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కళాకారులకు జ్ఞాపికలు అందజేత

బిక్కవోలు: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. నగర సంకీర్తనతో స్వామి రథోత్సవంలో కోలాటం ఆడిన బృందం కళాకారులకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు జ్ఞాపికలు అందించారు. కళాకారులు చక్కటి ప్రదర్శనతో పలువురి మన్ననలు అందుకున్నారు. ఆలయం వద్ద నిర్వహించిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినీ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు.

15న మహాదన్ను సభ

సీటీఆర్ఐ: గీత కులాలకు మద్యం దుకాణాల్లో 10 శాతం రాయితీ కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతగా ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు లాలాచెరువు సెంటర్‌లో మహాదన్ను సభ నిర్వహిస్తున్నామని రాష్ట్ర శెట్టిబలిజ అభివృద్ధి, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో సోమవారం శెట్టిబలిజ, గౌడ సంఘీయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజ పితామహుడు, దివంగత నేత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ అనంతరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు అభినందన సభ, అనంతరం శెట్టిబలిజ కార్పొరేషన్ పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుందన్నారు.

సినిమాలు



శ్యామల	:	పుష్ప–2
సూర్యమినీ	:	మెకానిక్ రాకీ
సూర్యప్యాలెస్	:	పుష్ప–2
శివజ్యోతి	:	పుష్ప–2
అనుశ్రీ	:	పుష్ప–2
స్వామి	:	పుష్ప–2
అశోక	:	పుష్ప–2
రాజా	:	పుష్ప–2
రంభ	:	మెకానిక్ రాకీ
ఊర్వశి	:	పుష్ప–2
మేనక	:	అమరన్
కుమారి	:	పుష్ప–2
అప్సర	:	పుష్ప–2
నామవరం		
వీఎస్ మహల్	:	పుష్ప–2
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	పుష్ప–2
కడియం		
వెంకటసూర్య	:	పుష్ప–2

కార్తికం.. కమనీయం

- ఆర్టీసీకి కాసుల వర్షం
- పుణ్యక్షేత్రాల బస్సులకు విశేష ఆదరణ
- రాజమహేంద్రవరం డిపోకు రూ.36.59 లక్షల ఆదాయం

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక మాసంలో ఆర్టీసీకి మంచి ఆదాయం వచ్చింది. రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలకు బస్సులను నడపడం ద్వారా లాభాలను గడించింది. ముఖ్యంగా రాజమహేంద్రవరం డిపో లక్షల రూపాయలు సంపాదించింది. కార్తిక మాసం సందర్భంగా నవంబర్ 2వ తీదీ నుంచి డిసెంబర్ ఒకటి వరకూ పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడిపింది. అలాగే శబరిమల అయ్యప్ప స్వామి ఆలయానికి ఆరు ప్రత్యేక బస్సులను తిప్పింది. వీటి ద్వారా రూ.11.25 లక్షలు సంపాదించింది.

పంచారామాలు

కార్తిక మాసంలో పంచారామాలను చాలా మంది భక్తులు సందర్శిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పంచారామ క్షేత్రాలకు 22 ప్రత్యేక బస్సులు నడపగా రూ.8.30 లక్షలు సమకూరాయి. అలాగే శ్రీశైలానికి 13 ప్రత్యేక బస్సులు తిప్పడం ద్వారా రూ.6,32,245 ఆదాయం వచ్చింది. అన్నవరం దేవస్థానానికి 19 ప్రత్యేక బస్సుల ద్వారా రూ.1,72,370 ఆర్జించింది. వీటితో పాటు భక్తులు, పర్యాటకుల కోరిక మేరకు ఏకాదశి రుద్రులు, మారేడుమిల్లి, అంతర్వేది, అరకు, అరుణాచలం, తెలంగాణలోని వండర్ వరల్డ్.. ఇలా వివిధ ప్రాంతాలకు 21 ప్రత్యేక బస్సులను తిప్పింది. వీటి ద్వారా సుమారు రూ.తొమ్మిది లక్షలు సమకూరాయి. ఇలా.. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని 81 ప్రత్యేక బస్సులను నడిపి రూ.36,59,622 సంపాదించింది.

కాశీయాత్రకు ప్రత్యేక బస్సు

త్వరలో రానున్న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాశీకి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయనున్నారు. 11 రోజుల పాటు 13 పుణ్యక్షేత్రాలను దర్శించుకునేలా ప్రణాళిక రూపొందించారు. మహాశివరాత్రి పర్వదినం రోజున కాశీలో ఉండేలా టూర్ ప్యాకేజీని డిజైన్ చేశారు. దీనిలో భాగంగా శివరాత్రికి ఐదు రోజుల ముందు రాజమహేంద్రవరం నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది.



ప్రత్యేక బస్సు

సందర్శించే ఆలయాలు

కాశీయాత్రలో భాగంగా భక్తులు లింగరాజస్వామి (భువనేశ్వర్), జగన్నాథస్వామి (పూరీ), సూర్యనారాయణస్వామి (కోణార్క్), గిరిజాదేవి (బాజ్‌పూర్), బడే హనుమాన్ (అలహాబాద్), కల్యాణీ దేవి (అలహాబాద్) ఆలయాలు, త్రివేణి సంగమం, కాశీ విశ్వేశ్వరస్వామి (జ్యోతిర్లింగం), కాశీ అన్నపూర్ణ, విశాలాక్షి ఆలయం, అయోధ్య బలరామ మందిరం , సీతామడిలో సీతాసమహిత్ స్థల్ (సీతామర్హి ఆలయం), నైమిశారణ్యంలో గోమతి నదీస్నానం, చక్రతీర్థం, రుద్రావర్తం, లలితాదేవి (ఉపశక్తిపీఠం), గయలో విష్ణుపాద, మంగళ గౌరి, బుద్ధగయలో మహాబోధి, అరసవిల్లి సూర్యనారాయణస్వామి, అన్నవరం రమా సత్యనారాయణస్వామి ఆలయాలను సందర్శిస్తారు. ఈ యాత్రలో ప్రత్యేకంగా వంట మనిషి, నలుగురు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం సిద్ధం చేయిస్తారు. కోణార్క్‌లో ఒక రోజు, కాశీలో రెండు రోజులు, నైమి శారణ్యంలో ఒక రోజు బస చేయాల్సి ఉంటుందని డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ టూర్ కోసం మనిషికి రూ.12,800 చార్జీ వసూలు చేస్తారు. మరిన్ని వివరాలకు 95023 00189, 99666 66544, 98660 45588 నంబర్లలో సంప్రదించాలి.



యాత్రకు బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు (ఫైల్)

సంతృప్తికర సేవలు



కార్తిక మాసాన్ని పురస్కరించుకుని దేశంతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపడం సంతృప్తినిచ్చింది. యాత్రికుల మనోభావాలను గౌరవిస్తూ నిర్దిష్ట సమయాలకు బస్సులు నడిపాం. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నాం. త్వరలో కాశీ, అయోధ్య యాత్రకు బస్సులను సిద్ధం చేస్తున్నాం.

– షేక్ షబ్నం, ఆర్టీసీ డిపో మేనేజర్, రాజమహేంద్రవరం

ధన్యవాదాలు



కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపడం చాలా బాగుంది. అన్ని ఆలయాలను సందర్శించే అవకాశం కలిగింది. ఈ బస్సుల ద్వారా సామాన్యులు చాలా సౌకర్యంగా యాత్రా స్థలాలను దర్శించుకునే వీలుంటుంది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్న ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు.

– పిట్టా భువనేశ్వరీదేవి, రాజమహేంద్రవరం

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఆనంద్‌బాబు, నరేంద్రచారి

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నంలో ఆదివారం జరిగిన ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ టీమ్ సెలక్షన్స్, స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలలో బొమ్మూరుకు చెందిన మారుతీ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు రాణించారు. బాలుర విభాగంలో 25 కేజీలలో జె.రేవన్ వర్మ ప్రథమ, జి.ఓషిత్ నాయుడు తృతీయస్థానాల్లో నిలిచారు. 26 కేజీలలో జి.రేష్మత్ నాయుడు ద్వితీయ, 28 కేజీలలో వి.అశ్వత్ వర్మ ద్వితీయ, 68 కేజీలలో ఎన్.రుత్విక్ వీరసాగర్ ద్వితీయ స్థానాలు సాధించారు. వీరితో పాటు జిల్లా కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు, శిక్షకుడు ఎం.గణేష్, సెక్రటరీ, శిక్షకుడు ఎస్.గిరి వెంకట రమణలను స్టేట్ కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు జి.ఆనంద బాబు, సెక్రటరీ కె.నరేంద్రచారి అభినందించారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రకాశం నగర్: రాష్ట్రంలోని పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. అదానీ గ్రూప్ అవినీతిపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలన్నారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. మధు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల స్థలం పేదలకు అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంబాబు, వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వాతావ'రణం'పై రైతులను అప్రమత్తం చేశాం

- 10 వేల టార్పాలిన్లు సిద్ధం
- కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా రైతులను అప్రమత్తం చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జాయింట్ కలెక్టర్ చిన్న రాముడుతో కలసిన తన క్యాంపు కార్యాలయంలో ఆమె సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతుల ధాన్యం తడిసిపోకుండా 10,100 టార్పాలిన్లు సిద్ధంగా ఉంచామని చెప్పారు. వీటిని రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా 18 మండలాల్లోని 221 రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 2.30 మెట్రిక్ లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనేది లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 209 కేంద్రాల ద్వారా రూ.467.30 కోట్ల విలువైన 2,03,256 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 25,365 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని వివరించారు. జిల్లాలోని 91 శాతం రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.420.63 కోట్లు 48 గంటల్లోగా జమ చేశామని చెప్పారు. రైతుల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 2 వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో రెండు రోజుల్లో రైతుల నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇప్పటి వరకూ 54 లక్షల గోనెసంచులు అందించామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. కాగా, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై కలెక్టర్ తదితరులు 170 అర్జీలు స్వీకరించారు.



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్న రాముడు

అవినీతికి వ్యతిరేకంగా సమష్టి పోరాటం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో పేరుకుపోయిన అవినీతిని తరిమికొట్టేందుకు మనమంతా కృషి చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఏజెన్సీ టైగర్, కీర్తిశేషులు ముత్యాల ముత్యాల రాయుడు మిత్రమండలి, మేడా మహామిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆర్యాపురంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవినీతి రహిత సమాజంలో కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సుంకర వెంకట భాస్కర రంగారావు, బద్దిరెడ్డి సత్యనారాయణ, న్యాయవాదులు ధర్నాల కోట వెంకటేశ్వరరావు, పలివెల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసకులకు అడుగడుగునా మార్గనిర్దేశం

కంబాలచెరువు: అభ్యాసకులందరికీ అడుగడుగునా మార్గనిర్దేశం చేసేందుకు సమగ్రమైన వనరులు, అంకితభావం కలిగిన అధ్యాపకులు, సిబ్బందితో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రం (ఇగ్నో) పనిచేస్తోందని ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ కృష్ణారావు పేర్కొన్నారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇండక్షన్ ప్రోగ్రామ్‌కు ఆయన సోమవారం ముఖ్య అతిథిగా విచ్చేశారు. అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం.గౌతమ్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా లక్షల మంది ఔత్సాహిక అభ్యాసకులకు విద్య, వృత్తి పరమైన, వ్యక్తిగత లక్ష్యాలు సాధించడానికి ఐజీఎన్‌ఓయూ మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. అందరికీ విద్య అందుబాటులో ఉండేలా కృషి చేస్తుందన్నారు. దీనికి ఎప్పటికప్పుడు అభివృద్ధి పర్చిన స్టడీ మెటీరియల్, కౌన్సెలింగ్ సెషన్లు, డిజిటల్ ఆడియో, వీడియో సపోర్ట్‌ను అందిస్తోందన్నారు. ఐజీఎన్‌ఓయూ జ్ఞాన్‌దర్శన్, జ్ఞాన్ కోష్, జ్ఞాన్ ధార వంటి వెబ్ ఆధారిత పోర్టల్, కార్యక్రమాలను క్రమం తప్పకుండా వీక్షించాలన్నారు. అవసరం అని భావించిన కోర్సులకు అధ్యయన కేంద్రాల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యా కౌన్సెలింగ్ సెక్షన్లు సెక్షన్లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పలువురి సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం అధ్యయన కేంద్ర సిబ్బందితో సమావేశమై వివిధ రికార్డులను పరిశీలించారు. కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ప్రాంతీయ సంచాలకులు కృష్ణారావు

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ



వీల్ చైర్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు

ధవళేశ్వరం: దివ్యాంగులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అన్నారు. ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం ఎస్సై క్రాంతి కుమార్ విచ్చేశారు. తొలుత కేక్ కట్ చేసి దివ్యాంగులకు తినిపించారు. అనంతరం వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన పరికరాల కోసం సంప్రదిస్తే, అర్హులకు అందిస్తామన్నారు. ఎస్సై క్రాంతి కుమార్ మాట్లాడుతూ స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆళ్ల ఆనందరావు, అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడు పలివెల రాజు, దివ్యాంగుల హక్కుల వేదిక ఉద్యోగుల విభాగం చైర్మన్ సూరంపూడి మాణిక్యాలరావు, నాయకులు కండెల్లి రజనీ కుమార్, ర్యాలీ శివ, కృప, కండేపల్లి వీరరామ సాగర్, ఆదం ఫకీర్, బసన బోయిన దుర్గ పాల్గొన్నారు.

గోపిమూర్తి విజయంపై సంబరాలు



సంబరాలు జరుపుకొంటున్న ఉపాధ్యాయ సంఘాలు

కంబాలచెరువు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గోపిమూర్తి విజయం సాధించడంతో యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక యూటీఎఫ్ హోమ్ వద్ద స్వీట్లు పంచి, ఆనందాన్ని పంచుకున్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లలోనే 8,400 ఓట్లు సాధించి టీచర్ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో విద్యావ్యవస్థకు మంచి రోజులు రానున్నాయని ఆ సంఘ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎన్.రవిబాబు, ప్రకాశరావు, జీవీ సుబ్బారావు, ఎం.నరేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్‌లో కడియం విద్యార్థుల ప్రతిభ

కడియం: జాతీయ కళా ఉత్సవ్ 2024 పోటీల్లో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని బొమ్మూరు డైట్ కాలేజీలో ఆరు విభాగాల్లో పోటీల్లో నిర్వహించారు. వీటిలో మూడు విభాగాల్లో కడియం విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వి.గాయత్రి నాగదేవి జానపద గేయాల విభాగంలో ద్వితీయ స్థానం, జానపద నృత్యంలో వై.సత్యసాయి మోహన పవిత్ర తృతీయ, వాయిద్య సంగీతంలో విభాగంలో షేక్ షరీస్ తృతీయ, చిత్రలేఖనంలో షేక్ అబ్దుల్ రహీం కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలైన విద్యార్థులను, వారికి శిక్షణ నిచ్చిన గొల్లపల్లి సత్యనారాయణను సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు రఫీయుద్దీన్, రామకృష్ణంరాజు, శ్రీవెంకట దుర్గ, శరత్ బాబు, సువర్ణవేణి, సూరిబాబు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

13, 14 తేదీల్లో అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రముఖులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 13, 14 తేదీల్లో అథ్లెటిక్స్ చాంపియన్ కం యూనివర్సిటీ టీమ్ పోటీలు జరగనున్నాయని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం విడుదల చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో తొలిసారిగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు అనుబంధ కళాశాలల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ వంటి మూడు విభాగాలలో జరిగే 24 ఈవెంట్లలో పురుషులు, మహిళలు పోటీపడతారన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు, సెక్రటరీ చొల్లంగి వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు చట్టపరిధిలో పరిష్కారం



అర్జీదారుడి సమస్యను వింటున్న ఎస్పీ నరసింహ కిశోర్, అధికారులు

కంబాలచెరువు: పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను నిర్దేశించిన సమయంలో చట్టపరిధిలో పరిష్కరించాలని అధికారులకు ఎస్పీ డి.నరసింహ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. వారి కష్టాలను, బాధలను ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలన్నారు. కాగా.. పీజీఆర్ఎస్‌కు 28 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాట, దొంగతనం తదితర కేసులకు సంబంధించినవి ఉన్నాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎల్.అర్జున్, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బీ) శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ (డీసీఆర్‌బీ) పవన్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్

19 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 19 అర్జీలను స్వీకరించినట్లు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ ఎస్.వెంకట రమణ, హెల్త్ ఆఫీసర్ వినూత్న, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కను'విందు'

దాళ్వా వరిసాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో పొలాలను దుక్కు చేస్తున్నారు. ట్రాక్టర్‌తో దుక్కుతున్న సమయంలో మట్టిలోని బయటకు వచ్చే పురుగులను తినేందుకు పెద్దసంఖ్యలో కొంగలు వచ్చి వాలుతున్నాయి. వందల సంఖ్యలో కొంగలు రావడంతో పొలం చాలా అందంగా కనిపిస్తోంది. హుకుంపేట గ్రామంలో సోమవారం ఈ దృశ్యం కనిపించింది.

– రాజమహేంద్రవరం రూరల్



